సాక్షి కామారెడ్డి

మంగళవారం । 1 । జూలై । 2025



ఫిర్యాదులను పరిష్కరించాలి
ప్రజావాణిలో నమోదైన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు.

- 8లో ▸



వసతుల కల్పన నా బాధ్యత
పాఠశాలల్లో వసతులు కల్పించాల్సిన బాధ్యత తనదని, టీచర్లు చక్కగా చదువులు చెప్పాలని ఎమ్మెల్యే పోచారం పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.6 /21.9

వాతావరణం
ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

'బాల్య వివాహాలు చేయొద్దు'



మాచారెడ్డి : బాల్య వివాహాలు చేయొద్దని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి టి.నాగరాణి సూచించారు. సోమవారం గజ్యానాయక్ తండా చౌరస్తాలో న్యాయసేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహ నిషేధ చట్టం, పోక్సో చట్టం, పిల్లల సంరక్షణ, బ్యాంకు రుణాలు, ఉచిత న్యాయ సలహాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాచారెడ్డి, గజ్యానాయక్ తండా పంచాయతీ కార్యదర్శులు ఆస్మా బేగం, జీవన్, న్యాయసేవాధికార సంస్థ సభ్యుడు ఖాన్ ఉన్నారు.

జిల్లాలో 30, 30(ఏ) పోలీస్ యాక్ట్ అమలు

కామారెడ్డి క్రైం: శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని నెలాఖరు వరకు జిల్లాలో 30, 30(ఏ) పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ రాజేశ్ చంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు శాఖ అనుమతి లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు, ధర్నాలు, ర్యాలీలు నిర్వహించరాదన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ పోలీసుశాఖకు సహకరించాలని ఎస్పీ కోరారు.

రేపు జిల్లా కేంద్రంలో జగన్నాథ రథయాత్ర



కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలో బుధవారం అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం(ఇస్కాన్) ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఇస్కాన్ కామారెడ్డి ఇన్‌చార్జి వెంకటదాస్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఇస్కాన్ ఆలయంలో రథయాత్ర వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ యాత్ర విద్యానగర్ కాలనీలోని పాత సాయిబాబా ఆలయం నుంచి ప్రారంభమై సిరిసిల్ల రోడ్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద ముగుస్తుందని పేర్కొన్నారు. యాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

కామారెడ్డి టౌన్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని డీఈవో రాజు కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక ఉర్దూ మీడియం పాఠశాలలో డిజిటల్ తరగతులను ప్రారంభించారు. స్థానిక కాంగ్రెస్ నేత ప్రసాద్ రూ. 25వేల విలువైన 56 ఇంచుల ఆండ్రాయిడ్ స్మార్ట్ టీవీని అందించారు. అనంతరం దాతను సన్మానించారు.

చేపల వేట నిషిద్ధం

నిజాంసాగర్ : నిజాంసాగర్ ప్రాజెక్టులో రెండు నెలల పాటు చేపల వేటను నిషేధిస్తున్నామని ఎఫ్‌డీవో డోలిసింగ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై, ఆగస్టు నెలల్లో చేపల ప్రసవ కాలం కావడంతో మత్స్యకారులు చేపలను వేటాడవద్దని సూచించారు. ఈ ఆదేశాలను బేఖాతరు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

దరఖాస్తుల ఆహ్వానం


కామారెడ్డి టౌన్: నిజాంసాగర్‌లోని నవోదయ విద్యాలయంలో 2026–27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో రాజు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 29లోపు http://navodaya.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పల్లెల్లో సందడి

- త్వరలోనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించే అవకాశం
- ప్రయత్నాలు మొదలుపెట్టిన ఆశావహులు
- వేడెక్కుతున్న రాజకీయాలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : పల్లెల్లో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. పంచాయతీ ఎన్నికలను మూడు నెలల్లో పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఆశావహులు ఎన్నికలకు సన్నద్ధమవుతున్నారు. ఓటర్ల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నారు.

జిల్లాలో 532 గ్రామ పంచాయతీలు, 4,656 వార్డులు ఉన్నాయి. పంచాయతీల్లో 6,51,422 మంది ఓటర్లు ఉండగా ఇందులో 3,13,280 మంది పురుషులు, 3,38,126 మంది మహిళలు, 16 మంది ఇతరులు ఉన్నారు. పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం గతేడాది ఫిబ్రవరి ఒకటో తేదీతో ముగిసింది. ఎన్నికలు నిర్వహించకపోవడంతో పంచాయతీలు ప్రత్యేకాధికారుల పాలనలోకి వెళ్లిపోయాయి. అప్పట్లోనే ఎన్నికలు నిర్వహిస్తారని ఆశించినవారు.. ప్రభుత్వం ఎన్నికలను ఎప్పటికప్పుడు వాయిదా వేస్తూ వస్తుండడంతో నీరుగారిపోయారు. ఈ నేపథ్యంలో వచ్చే మూడు నెలల్లో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని కోర్టు ఆదేశించడంతో ఆశావహుల్లో ఆశలు చిగురించాయి. ప్రభుత్వం కూడా ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం అవుతుండడంతో ఈసారి ఎన్నికలు జరుగుతాయన్న భావనలో ఉన్నారు. దీంతో చాలా గ్రామాల్లో ఆశావహులు బలాన్ని, బలగాన్ని పెంచుకునే పనిలో పడ్డారు. ముఖ్యంగా ఆదాయ వనరులు ఎక్కువగా ఉండే గ్రామాల్లో ఈసారి ఎక్కువ మంది పోటీపడే అవకాశాలున్నాయి. పాతవారే కాకుండా కొత్త తరం కూడా ఎన్నికల బరిలో నిలిచేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఆర్థికంగా ఉన్న వారు కొందరు అప్పుడే ఖర్చులూ మొదలుపెట్టారు. కుల సంఘాలు, యువజన సంఘాల మద్దతు కూడగట్టుకుంటున్నారు. మహిళల ఓట్లపైనా కన్నేసి వారి మద్దతు సంపాదించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటి నుంచే అందరినీ మేనేజ్ చేయడానికి పెద్ద ఎత్తున డబ్బులు వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామాల్లో భూముల క్రయవిక్రయాలతో నాలుగు డబ్బులు సంపాదించిన వారే ఎక్కువగా ఎన్నికల బరిలో దిగేందుకు ఉత్సాహం చూపుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ఎన్నికల ఖర్చు భారీగా పెరిగే అవకాశాలున్నాయి.



రిజర్వేషన్లపై ఉత్కంఠ

పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అంశం కీలకంగా మారింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని గతంలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. రాష్ట్రప్రభుత్వం కులగణన కూడా నిర్వహించింది. అయితే దీనికి సంబంధించిన బిల్లుపై స్పష్టత లేదు. ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యేలోపు స్పష్టత వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. కోర్టు ఆదేశాల నేపథ్యంలో గతంలో ఉన్న రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలకు వెళ్లే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

యంత్రాంగం రెడీ..

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను గతంలోనే పూర్తి చేశారు. బ్యాలెట్ బాక్సులకు మరమ్మతులు చేయించడంతో పాటు రంగులు వేయించారు. ఓటరు తుది జాబితాలు రెడీ చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బంది నియామక ప్రక్రియ కూడా పూర్తి చేశారు. షెడ్యూల్ ఎప్పుడు వెలువడినా ఎన్నికలు వెంటనే నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నారు. పోలింగ్ కేంద్రాలను కూడా సిద్ధం చేసి ఉంచారు. షెడ్యూల్ వెలువడిన వెంటనే ఎన్నికల ప్రక్రియ షురూ చేయడానికి సన్నద్ధంగా ఉన్నారు.



సిరిసిల్లరోడ్‌లో వెలగని లైట్లు

పట్టణంలో అంధకారం

- అధ్వానంగా వీధి దీపాల నిర్వహణ
- ఏడాదినుంచి బల్బుల కొరత.. కాలనీల్లో వెలగని లైట్లు
- పట్టించుకోని అధికారులు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి పట్టణంలో వీధి దీపాలు, ప్రధాన రోడ్లపై సెంట్రల్ లైటింగ్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. దీంతో కొన్ని కాలనీల్లో సాయంత్రం కాగానే చీకట్లు అలుముకుంటున్నాయి. కాలనీలతో పాటు ప్రధాన రోడ్లపైనా పలుచోట్ల వీధిదీపాలు వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాంట్రాక్టర్‌కు బకాయిలను చెల్లించకపోవడంతో నిర్వహణను గాలికి వదిలేయడంతో ఈ పరిస్థితి నెలకొంది.

ఏడాది దాటినా..

కామారెడ్డి బల్దియాలో 500లకుపైగా కాలనీలున్నాయి. లక్షకుపైగా జనం నివసిస్తున్నారు. పట్టణంలో ప్రధాన రోడ్లపై డివైడర్‌లలో ఏర్పాటు చేసిన 890 విద్యుత్ దీపాల నిర్వహణ బల్దియానే చూసుకుంటుంది. కాలనీలలో 12,434 వీధి దీపాలు ఉండగా వీటి నిర్వహణ బాధ్యతను ఈఎస్ఎస్ అనే కంపెనీకి టెండర్ ద్వారా అప్పగించారు. ప్రతినెలా వీటి నిర్వహణకు రూ. 10 లక్షలకుపైగా కంపెనీకి చెల్లించాల్సి ఉంటుంది. అయితే మూడేళ్లుగా బిల్లులు చెల్లించడం లేదు. దీంతో బకాయిలు రూ. 3.40 కోట్లకు చేరాయి. బకాయిల భారం పెరగడంతో కాంట్రాక్ట్ పొందిన సంస్థ వీధిదీపాల నిర్వహణను గాలికి వదిలేసింది. పాడైపోయినవాటి స్థానంలో నూతన దీపాలను కొనుగోలు చేయకపోవడంతో చాలా కాలనీలలో వీధిదీపాలు వెలగక రాత్రి వేళలో అంధకారం అలుముకుంటోంది. శివారు కాలనీలలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది.

సెంట్రల్ డివైడర్‌లలోనూ..

ప్రధాన రోడ్లపై సెంట్రల్ డివైడర్‌లలో వీధి దీపాల నిర్వహణ బాధ్యతను బల్దియా చూసుకుంటోంది. అయితే నిర్వహణను బల్దియా అధికారులు పట్టించుకోకపోవడంతో హౌజింగ్ బోర్డు, మున్సిపల్ కార్యాలయం ముందు, రైల్వే బ్రిడ్జి, సిరిసిల్లరోడ్, స్టేషన్‌రోడ్, టేక్రియాల్ రోడ్, దేవునిపల్లి రోడ్‌లలో చాలా వరకు లైట్లు వెలగడం లేదు. దీంతో పట్టణంలోని చాలాచోట్ల రాత్రి వేళలో చీకట్లోనే ప్రయాణించాల్సి వస్తోంది.



టేక్రియాల్ రోడ్‌లో వెలగని సెంట్రల్ లైట్లు

సమస్య పరిష్కరిస్తాం



పట్టణంలో వీధి దీపాల నిర్వహణ కంపెనీకి బకాయిలు ఉన్నాయి. వాటిని త్వరలో చెల్లిస్తాం. ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు సమస్యను నివేదిస్తున్నాం. త్వరలో నూతన విద్యుత్ దీపాలను కొనుగోలు చేస్తాం. సమస్య ఉన్న కాలనీలలో వాటిని బిగిస్తాం.

– రాజేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, కామారెడ్డి



కొత్త బస్టాండ్ ముందు వెలగని లైట్లు

ఒకటే గది.. తరగతులు ఐదు

- 70 మంది విద్యార్థులకు ఇద్దరే టీచర్లు
- చెట్ల కింద బోధన..
- కుబ్యానాయక్ తండా బడిలో ఇదీ పరిస్థితి
- అదనపు గదులు నిర్మించాలని కోరుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు



ఒకే గదిలో కూర్చున్న ఐదు తరగతుల విద్యార్థులు

పెద్దకొడప్‌గల్ : కుబ్యానాయక్ తండాలోని ప్రాథమిక పాఠశాలలో ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు. బడిలో ఒకటే గది ఉంది. ఈ భవనం కూడా శిథిలావస్థకు చేరింది. ఆఫీస్ రూంతోపాటు ఐదు తరగతులకు ఇదే గది దిక్కు. కాగా గతేడాది వరకు ఈ బడిలో 39 మంది విద్యార్థులు మాత్రమే ఉండేవారు. ఉపాధ్యాయులు బడిబాటలో భాగంగా ఇంటింటికి వెళ్లారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా బోధిస్తామని, విద్యార్థుల్లో మార్పు రాకపోతే మళ్లీ ప్రైవేట్ పాఠశాలకే పంపించుకోండని చెప్పారు. దీంతో తండావాసులు తమ పిల్లలను సర్కారు బడికి పంపిస్తుండడంతో ఈసారి విద్యార్థుల సంఖ్య 70కి చేరింది. ప్రస్తుతం మొదటి తరగతిలో 15 మంది విద్యార్థులుండగా.. రెండో తరగతిలో 19 మంది, మూడో తరగతిలో 14 మంది, నాలుగో తరగతిలో 8 మంది, ఐదో తరగతిలో 14 మంది విద్యార్థులున్నారు.

ఆ తండాలో ప్రాథమిక పాఠశాల ఉంది. ఐదు తరగతుల్లో 70 మంది విద్యార్థులున్నారు. వీరికి పాఠాలు బోధించడానికి ఉన్నది ఇద్దరు టీచర్లే.. చదువుకోవడానికి ఉన్నది ఒకే ఒక్కగది. దీంతో కొంతమందిని గదిలో కూర్చోబెట్టి పాఠాలు చెబుతుండగా.. మరికొందరికి చెట్టు కింద బోధిస్తున్నారు.



గదుల కొరతతో ఇబ్బంది..

పాఠశాలలో 70 మంది విద్యార్థులుండగా.. ఒక్క గది మాత్రమే ఉంది. దీంతో ఆ గదిలోనే ఐదు తరగతుల పిల్లలకు విద్యాబోధన చేయాల్సిన పరిస్థితి. దీంతో కొంతమందిని చెట్ల కింద కూర్చోబెట్టి పాఠాలు చెబుతున్నారు. అలాగే బడిలో ఉపాధ్యాయుల కొరత ఉంది. 60 మందికన్నా ఎక్కువ విద్యార్థులుంటే నిబంధనల ప్రకారం ముగ్గురు టీచర్లు ఉండాలి. విద్యార్థులకు సరిపడా తరగది గదులు నిర్మించాలని, మరో టీచర్‌ను కేటాయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

కుబ్యానాయక్ తండాలోని ప్రాథమిక పాఠశాలలో ఒకటే గది ఉంది. అది కూడా శిథిలావస్థకు చేరింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించి, తరగతి గదుల మంజూరు కోసం కృషి చేస్తాం. ఈసారి విద్యార్థుల సంఖ్య పెరిగినందున మరో టీచర్‌ను కేటాయించే ఏర్పాట్లు చేస్తాం.

– ప్రవీణ్ కుమార్, ఎంఈవో

పట్టు సాగుకు ముందుకు రావాలి



బీబీపేట: పట్టు పరిశ్రమ ఏర్పాటుకు రైతులు ముందుకు రావాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖల అధికారి జ్యోతి సూచించారు. సోమవారం యాడారంలో మల్బరీ మొక్కల మెగా వనమహోత్సవం నిర్వహించారు. గ్రామానికి చెందిన నవీన్ రావు పది ఎకరాల్లో మల్బరీ సాగుకు ముందుకు రావడంతో ఆయన వ్యవసాయ క్షేత్రంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది 120 ఎకరాలలో మల్బరీ సాగును ప్రోత్సహించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఉద్యాన అధికారి సంతోషిరాణి, సెరికల్చర్ అధికారి అయిలయ్య, అసిస్టెంట్ నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

'యూరియా కొరత పేరుతో దోచుకుంటున్నారు'

గాంధారి: యూరియా కొరత పేరుతో వ్యాపారులు రైతులను దోచుకుంటున్నారని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు విఠల్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం బీకేఎస్ నాయకులు మండల కేంద్రంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాలను సందర్శించారు. వ్యాపారులు, రైతులతో మాట్లాడారు. ఎరువుల నిల్వల గురించి తెలుసుకున్నారు. యూరియా బస్తాతోపాటు ఇతర రసాయనాలను అంటగడుతున్నారని రైతులు ఆరోపించారు. లేదంటే యూరియా లేదంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయాధికారులు తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీకేఎస్ కార్యదర్శులు శంకర్‌రావు, రావుసాహెబ్‌రావు పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు

రైతులు ఆందోళన చెందవద్దని, మండలంలో యూరియా కొరత లేదని ఏవో రాజలింగం తెలిపారు. యూరియా వాడకం తగ్గించాలని సూచించారు. నానో యూరియా పిచికారి చేస్తే ఖర్చు తగ్గడమే కాకుండా భూమి సారవంతం అవుతుందన్నారు. వ్యాపారులు యూరియా బస్తాలతో పాటు ఇతర రసాయనాలు ఇస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని, తనిఖీలు చేసి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.



మాట్లాడుతున్న బీకేఎస్ నేతలు

ధరణి నిండా సమస్యలే!

- సర్కారు టౌన్‌షిప్‌లో ప్లాట్లు విక్రయించి రెండున్నరేళ్లు
- ఇప్పటికీ మౌలిక వసతులు కల్పించని ప్రభుత్వం
- మోసపోయామంటున్న ప్లాట్లు కొనుగోలు చేసినవారు
- సౌకర్యాలు కల్పించాలని వినతి

కామారెడ్డి అర్బన్ : ధరణి టౌన్‌షిప్‌లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పి, జనాలను ఆకర్షించి ప్లాట్లు విక్రయించిన పాలకులు.. ఆ తర్వాత దాని ఊసే మరిచిపోయాయి. కనీస సౌకర్యాలు కూడా కల్పించకపోవడంతో అక్కడ ప్లాట్లు కొనుగోలు చేసినవారు మోసపోయామంటూ ఆవేదన చెందుతున్నారు. సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఆందోళన బాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు.

దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో 2009 సంవత్సరంలో కామారెడ్డిలో ఎన్44వ నంబర్ జాతీయ రహదారి పక్కన రాజీవ్ స్వగృహ ఏర్పాటు చేశారు. ప్రస్తుత కలెక్టరేట్ సమీపంలో అడ్లూర్ శివారు 501/3 సర్వే నంబర్‌లో 50.29 ఎకరాల విస్తీర్ణంలో 40 అడుగుల ప్రధాన రోడ్డు, 30 అడుగుల అంతర్గత రోడ్లతో వివిధ పరిమాణాల్లో మొత్తం 543 ప్లాట్లు చేశారు. 313 ప్లాట్లలో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. మరో 230 ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి. ఈ ఇళ్ల కోసం అప్పట్లో ఆసక్తిగలవారినుంచి డీడీలు తీసుకున్నారు. అయితే రాజశేఖరరెడ్డి మరణానంతరం ఇళ్ల నిర్మాణం మరుగున పడింది. ఆ తర్వాత వచ్చిన పాలకులు ఎవరూ పట్టించుకోకపోవడంతో ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి. అప్పట్లో రాజీవ్ స్వగృహలో ఇళ్ల కోసం డీడీలు చెల్లించినవారికి మూడేళ్ల క్రితం డబ్బులు వాపస్ ఇచ్చారు. రాజీవ్ స్వగృహను పట్టించుకునేవారు లేకపోవడంతో ప్లాట్ల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి, అడవిలా మారింది.

అందమైన బ్రోచర్లు ముద్రించి..

గత ప్రభుత్వం వృథాగా ఉన్న రాజీవ్ స్వగృహను 2022లో కాస్త అభివృద్ధి చేసి ధరణి టౌన్‌షిప్‌గా పేరు మార్చింది. అందమైన బ్రోచర్ ముద్రించి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పి ఐదు విడతల్లో ప్లాట్లను విక్రయించింది. సర్కారే ఎలాంటి హామీ లేకుండా ప్లాట్ల మార్టిగేజ్‌తో కెనరా బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించింది. టౌన్‌షిప్‌లోని ప్లాట్లను వేలం వేయడం ద్వారా సర్కారుకు సుమారు రూ. 50 కోట్ల వరకు ఆదాయం సమకూరింది. వేలం వేసిన తర్వాత టౌన్‌షిప్‌ను నిర్లక్ష్యం చేసింది. ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడం, కనీస మౌలిక వసతులు కూడా కల్పించకపోవడంతో ప్లాట్లు కొనుగోలు చేసినవారు ఆవేదన చెందుతున్నారు. అందమైన బ్రోచర్లు, హామీలతో సర్కారు మోసం చేసిందని ఆరోపిస్తున్నారు. ధరణి టౌన్‌షిప్‌లో కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఇటీవల టౌన్‌షిప్ బాధితులు సమావేశమై వెంచర్ వరకు ర్యాలీ తీశారు. సౌకర్యాలు కల్పించకపోతే ఆందోళనలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. టౌన్‌షిప్ అభివృద్ధికి దాదాపు రూ. 14 కోట్లు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేశారని, సర్కారు వెంటనే నిధులు మంజూరు చేయాలని 'ధరణి' బాధితుల సంఘం ప్రతినిధి రాజనర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. టౌన్‌షిప్‌లో ఇంకా 14 ఎకరాలు ఖాళీగా ఉందని, అభివృద్ధి చేసి విక్రయిస్తే ప్రభుత్వానికి మరో రూ. 50 కోట్ల ఆదాయం సమకూరే అవకాశాలున్నాయని, దీనిని పరిశీలించాలని కోరారు.



ధరణి టౌన్‌షిప్ ముఖద్వారం



అభివృద్ధి లేకపోవడంతో ఇళ్ల చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు

కనీస వసతులు లేవు



ధరణి టౌన్‌షిప్‌లో రూ. 35 లక్షలకు ఇల్లు కొనుగోలు చేశాను. ఇక్కడ కనీస వసతులు కూడా లేవు. సర్కారు పట్టించుకోవడం లేదు. దీంతో ఇప్పటికీ గృహప్రవేశం చేయలేదు.

– కైలాస్ రాజేశ్వరరావు, కామారెడ్డి

పొలం దగ్గర ఉందని కొన్నా



ధరణి టౌన్‌షిప్ సమీపంలో నాకు వ్యవసాయ భూమి ఉంది. పొలం దగ్గరగా ఉంటుందని ఇక్కడ ఇల్లు కట్టుకోవడానికి 150 గజాల ప్లాటు తీసుకున్నాను. సౌకర్యాలు కల్పించాలి.

– బి.ప్రతాప్ నేత, అడ్లూర్

కామారెడ్డికి దగ్గరగా ఉందని..



గేటెడ్ కమ్యూనిటీలో ప్లాటు తీసుకుంటే బాగుంటుందని 'ధరణి'లో ప్లాటు తీసుకున్నా. వసతులు లేకపోవడంతో ఇక్కడ ప్లాటు ఎందుకు తీసుకున్నామని బాధపడుతున్నాం.

– కె.సౌమ్య, కామారెడ్డి

ప్లాటు కొని ఇబ్బందిపడుతున్నం



ప్రభుత్వ మాటలు నమ్మి ధరణిలో ప్లాటు కొనుగోలు చేశా. కానీ ఇక్కడ ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టడం లేదు. ప్రభుత్వం స్పందించి వెంటనే టౌన్‌షిప్‌ను అభివృద్ధి చేయాలి.

–శ్రీధర్, కామారెడ్డి

క్లుప్తంగా

జీపీగా బాధ్యతల స్వీకరణ



కామారెడ్డి: కామారెడ్డి జిల్లా కోర్టులకు ప్రభుత్వ న్యాయవాది(జీపీ)గా నియమితులైన శ్యాంగోపాల్‌రావు సోమవారం బాధ్యతలను స్వీకరించారు. జీపీగా శ్యాంగోపాల్‌రావును నియమిస్తూ ప్రభుత్వ న్యాయశాఖ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సోమవారం ఇన్‌చార్జి ఏజీపీ జగన్నాథం నుంచి బాధ్యతలను స్వీకరించారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ వీఆర్ఆర్ వర ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. న్యాయమూర్తి మాట్లాడుతూ.. పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నందరమేష్, న్యాయవాదులు ఉన్నారు.

మలిదశ ఉద్యమకారుల శాంతియుత దీక్ష



బాన్సువాడ : తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం బాన్సువాడ తహసీల్ కార్యాలయం ముందు మలిదశ ఉద్యమకారులు శాంతియుత దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మలిదశ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షులు ఉడుత గంగాధర్ మాట్లాడుతూ.. రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్ పిలుపు మేరకు ఒక్క రోజు శాంతియుత దీక్ష చేస్తున్నామని, తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులు హన్మండ్లు, సాయిరాం, బాబాగౌడ్, రాంచందర్, చందు, సాయికుమార్, శ్యాం, కృష్ణ, గంగారాం, తదితరులు ఉన్నారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 141 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో భూ సంబంధిత సమస్యలు, ఇబుల్ బెడ్‌రూం ఇళ్లు, రేషన్ కార్డులు, పింఛన్‌ల మంజూరులకు సంబంధించిన దరఖాస్తులు ఎక్కువగా వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించడం గానీ, పరిష్కార మార్గాలు చూపడం గానీ చేయాలన్నారు. సమస్యల పరిష్కారం విషయంలో తీసుకున్న చర్యల సమాచారాన్ని దరఖాస్తుదారునికి తెలియపరచాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్, ఆర్డీవో వీణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

ఎల్లారెడ్డిలో రెండు..

ఎల్లారెడ్డి/తాడ్వాయి: ఎల్లారెడ్డి తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రెండు ఫిర్యాదులు వచ్చినట్లు తహసీల్దార్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. అలాగే ఎల్లారెడ్డి విద్యుత్ శాఖ డీఈ కార్యాలయంలో, తాడ్వాయి తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎలాంటి ఫిర్యాదులు రాలేదని డీఈ విజయసారథి, తహసీల్దార్ శ్వేత వేర్వేరుగా తెలిపారు.

ఆలయ పరిధిని నిర్ధారించాలి

మహాదేవుని ఆలయం ఏ గ్రామ పరిధిలో ఉందో సర్వే చేసి నిర్ధారించాలని కోరుతూ గాంధారి మండలం గుడిమెట్ గ్రామస్తులు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. వారు మాట్లాడుతూ.. గుడిమెట్ వద్దనున్న గుట్టపై మహాదేవుని ఆలయం ఉందని, ఈ ఆలయం తమ గ్రామం పరిధిలోకి వస్తుందని తెలిపారు. కానీ, పక్కనే ఉన్న జువ్వాడి గ్రామస్తులు చాలా రోజులుగా ఆలయం తమ గ్రామం పరిధిలో ఉందని గొడవ చేస్తున్నారని అన్నారు. ఏ గ్రామ పరిధిలో ఉందో సర్వే చేసి తేల్చాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.



గుడిమెట్ గ్రామస్తులు, గాంధారి మండలం

సరిహద్దులపై రీ సర్వే చేయించాలి

రాజంపేట: ఆర్గొండ జీపీలో గల గ్రామ సరిహద్దులపై రీ సర్వే చేయించాలని జిల్లా కలెక్టర్‌కు వినతి అందజేసినట్లు ఆర్గొండ గ్రామస్తులు తెలిపారు. సోమవారం గ్రామస్తులు అందరూ కలిసి గ్రామపంచాయతీ సరిహద్దుల విషయంపై మండల ప్రత్యేక అధికారి ఎంపీడీవో రఘురాం అధ్యక్షతన ప్రత్యేక గ్రామసభ నిర్వహించి సరిహద్దుల గురించి చర్చించారు. అనంతరం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు.



ఆర్గొండ గ్రామ సభలో పాల్గొన్న గ్రామస్తులు

పుస్తకం ఆవిష్కరణ



కామారెడ్డి క్రైం: జిల్లా గణాంక శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన హ్యాండ్ బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్ 2023–24 పుస్తకాన్ని ప్రజావాణిలో భాగంగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆవిష్కరించారు. అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్, ఆర్డీవో వీణ, ఇన్‌చార్జి సీపీవో శివ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

కుల సంఘాల అభివృద్ధికి కృషి చేస్తా

- ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

రాజంపేట: గ్రామాలలోని సంఘాల అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. రాజంపేట మండల కేంద్రంతో పాటు పొందుర్తి, తలమడ్ల, శివాయిపల్లి, పెద్దాయిపల్లి, ఆరేపల్లి, ఆరేపల్లి తండాలలో తన సొంత నిధులతో నిర్మించిన వివిధ కుల సంఘాల భవనాలను సోమవారం ఆయన ప్రారంభించారు. బీజేపీ మండల అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ముదిరాజ్ సంఘ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

సభను విజయవంతం చేయాలి



కామారెడ్డి టౌన్/రాజంపేట: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నేడు నిర్వహించే లంబాడ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) విజయోత్సవ సభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు నునావత్ గణేష్ నాయక్, రాష్ట్ర కార్యదర్శి గుగ్లోత్ వినోద్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఎల్‌హెచ్‌పీఎస్ 28 ఏళ్లు పూర్తి చేసుకుని 29వ సంవత్సరంలోకి అడుగుపెడుతుందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బద్రి నాయక్, నేతలు శంకర్, రూప్‌సింగ్, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ తదితరులున్నారు.

దరఖాస్తుల గడువు పొడగింపు

కామారెడ్డి అర్బన్: జిల్లాలోని దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు అందించడానికి ఈనెల 5వరకు గడువు పొడిగించినట్లు జిల్లా సంక్షేమాధికారి ఏ.ప్రమీల ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన దివ్యాంగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని ప్రభుత్వ సహాయం పొందాలని సూచించారు.

ఆర్‌అండ్‌బీ ఈఈగా మోహన్



కామారెడ్డి క్రైం: రోడ్లు, భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పి.మోహన్ నియమితులయ్యారు. ఇదివరకు ఇక్కడ ఈఈగా పని చేసిన రవిశంకర్ పదోన్నతిపై రంగారెడ్డి జిల్లాకు వెళ్లారు. బాన్సువాడ డిప్యూటీ ఈఈగా పని చేసిన మోహన్.. కామారెడ్డి ఈఈగా పదోన్నతిపై వచ్చారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

వసతుల కల్పన నా బాధ్యత

- చదువు చెప్పడం ఉపాధ్యాయుల బాధ్యత
- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి
- అదనపు తరగతి గదుల ప్రారంభం

నస్రుల్లాబాద్: పాఠశాలలో వసతులను కల్పించడం నా బాధ్యత .. చదువు చెప్పడం ఉపాధ్యాయుల బాధ్యతని రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నెమ్లి గ్రామంలో సోమవారం పీఎంశ్రీ పాఠశాలలో రూ.40.50 లక్షలతో నూతనంగా నిర్మించిన సైన్స్ ల్యాబ్, అదనపు తరగతి గదుల ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాన్సువాడ ప్రజలకు విద్య, వైద్యం చేరువ అవ్వాలనే పని చేస్తున్నానన్నారు. ప్రత విద్యార్థి ఉన్నతంగా చదవాలంటే సౌకర్యాలు ఉండాలన్నారు. అందులో భాగంగానే విద్యార్థులు చదవడానికి అదనపు గదులను నిర్మించామన్నారు.

ఎడ్యుకేషన్ అనేది గేమ్ చేంజర్: సబ్ కలెక్టర్ కిరణ్మయి

ఎడ్యుకేషన్ అనేది ప్రతి వ్యక్తి జీవితంలో గేమ్ చేంజర్ అని బాన్సువాడ సబ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. ఉన్నతంగా చదివుతేనే జీవితంలో విజయం సాధిస్తామన్నారు. అరకొర వసతుల మధ్య విద్యను చదువుకున్న రోజుల్లోనే ఎంతో మంది తమ జీవితాలను మార్చుకున్నారని కాని ప్రభుత్వం ప్రస్తుతం విద్యకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వాటిని ఉపయోగించుని ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, తహసీల్దార్ సువర్ణ, ఎంఈవో చందర్ నాయక్, ఎంపీడీవో సూర్యకాంత్, ఏఎంసీ చైర్మన్ శ్యామల, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

జుక్కల్ అభివృద్ధే నా మొదటి ధ్యేయం

- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

మద్నూర్(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గ అభివృద్ధే నా మొదటి ధ్యేయమని దీని కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అన్నారు. డోంగ్లీ మండలంలోని ఇలేగావ్ నుంచి మదన్‌హిప్పర్గా వరకు నూతన బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. నాయకులు చాంద్ పటేల్, నాగేశ్ పటేల్, యూనుస్ పటేల్, బందు పటేల్, నాయకులు, కార్యకర్తలున్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం

బిచ్కుంద(జుక్కల్): ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాటపై కట్టుబడి ఉండి ఒకొక్క హామీ నెరవేర్చుతున్నామని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. సోమవారం మెక్కా గ్రామంలో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దశాబ్దాల నుంచి బీటీ రోడ్డు కోసం మెక్కా ప్రజలు ఎదురుచూస్తున్నారు నేటితో వారి కల నెరవేరిందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు శంకర్ పటేల్, విఠల్‌రెడ్డి, నాగ్‌నాథ్, వెంకట్‌రెడ్డి, సయ్యద్ మసూద్, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఇలేగావ్‌లో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

సెంట్రల్ లైటింగ్ పనుల పరిశీలన

బిచ్కుందలో కొనసాగుతున్న సెంట్రల్ లైటింగ్ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. రెండు వైపులా డ్రైనేజి పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను సూచించారు.

చెట్లతోనే పర్యావరణ పరిరక్షణ

నిజాంసాగర్(జుక్కల్): చెట్లతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. సోమవారం జుక్కల్‌లో ఎమ్మెల్యే చేతుల మీదుగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఇంటా మొక్కలు నాటి కాపాడాలన్నారు. కాంగ్రెస్ నేతలు రమేష్ దేశాయ్, సాయాగౌడ్, ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ తదితరులున్నారు.

'అప్పు తీరినా.. సబ్సిడీ మంజూరు కాలేదు'

కామారెడ్డి అర్బన్: మూడేళ్ల క్రితం బ్యాంకు రుణం ద్వారా ట్రాక్టర్‌ను కొనుగోలు చేయగా పరిశ్రమల శాఖ ద్వారా రావాల్సిన సబ్సిడీ ఇంకా విడుదల కాలేదని కామారెడ్డి మండలం ఉగ్రవాయి గ్రామస్తుడు కుర్మకులానికి చెందిన దివ్యాంగుడు దొంతల శివరాజు వాపోయారు. 2022లో దాదాపు రూ.12 లక్షలతో ట్రాక్టర్, ట్రాలీ, భూమి దున్నడానికి అవసరమయ్యే నాగళ్లు, ఇతర సామగ్రి కొనుగోలు చేయగా.. పరిశ్రమల శాఖ ద్వారా రూ.3లక్షల 9వేల 750 లు సబ్సిడీ విడుదల కావాల్సి ఉంది. ఈ మేరకు జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ వి.లాలు.. 2022లో సబ్సిడీ ఉత్తర్వులు ఇచ్చారు. ట్రాక్టర్‌పై కామారెడ్డి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ద్వారా తీసుకున్న రుణం వాయిదాలు చెల్లించినప్పటికి పరిశ్రమల శాఖ సబ్సిడీ ఇంకా విడుదల కాలేదు. సబ్సిడీ కోసం రూ.30 వేలు మధ్యవర్తులకు ఖర్చు చేశానని దొంతల శివరాజు వాపోయాడు.



తాను కొనుగోలు చేసిన ట్రాక్టర్‌తో శివరాజు

2021 నుంచి సబ్సిడీ రాలేదు

జిల్లాలో 2021, మార్చి నుంచి నేటికి ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు సంబంధించి ఒక్కరికి సబ్సిడీ విడుదల కాలేదు. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే నేరుగా బ్యాంకు ఖాతాలో జమవుతుంది. శివరాజు ఎక్కడికి తిరగవద్దు..ఎవరికీ డబ్బులివ్వ వద్దు.

– లాలు, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్







సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS SERVICES

■ మీ బంగారం మణప్పురం ముత్తుట్, మార్వాడి షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9389214214. [H-783418]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్రైం కార్నర్

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి



బోధన్‌రూరల్: మండలంలోని బండార్‌పల్లికి చెందిన సాయికుమార్(28) చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు వల చుట్టుకుని నీటి మునిగి మృతిచెందినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి సోమవారం తెలిపారు. మృతుడి భార్య అనురాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

అర్గుల్‌లో ఒకరి అదృశ్యం



జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్‌లో నివాసముంటున్న లింగంపేట గ్రామానికి చెందిన కొరబోయిన అశోక్ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్సై మాలిక్ రహమాన్ తెలిపారు. ఈ నెల 28న రాత్రి 9 గంటలకు జక్రాన్‌పల్లిలోని తన స్నేహితుడిని కలిసి వస్తానని చెప్పి బైక్‌పై వెళ్లిన అతను తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. అశోక్ తండ్రి ప్రభురాజ్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోచంపాడ్‌లో పిచ్చికుక్కల స్వైర విహారం





బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌లో సోమవారం ఉదయం పిచ్చి కుక్కలు స్వైర విహారం చేశాయి. గ్రామంలో వీధుల గుండా కనిపించిన వారిపై దాడి చేశాయి. దీంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన రజిత చేతిపై, విఠల్, విష్ణులకు కంటి, కాలి భాగాలపై దాడి చేసి గాయపర్చాయి. వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. పోచంపాడ్‌లో వీధి కుక్కలు ఎక్కువ కావడంతో కనిపిస్తే కరుస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డీఎస్ విగ్రహావిష్కరణలో దొంగల చేతివాటం

నిజామాబాద్ రూరల్: కంఠేశ్వర్ బైపాస్ సిగ్నల్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన డీఎస్ విగ్రహావిష్కరణలో కేంద్ర మంత్రి అమిత్‌షా చేతుల మీదుగా జరిగిన విషయం తెలిసిందే. ఈ ఆవిష్కరణలో మారుతి నగర్‌కు చెందిన ప్రభుత్వ ఉద్యోగి కాసుల రఘు, అలాగే బాశెట్టి గంగాధర్‌కు చెందిన బంగారు గొలుసులను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరిఫ్ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నీవు లేని జీవితం నాకొద్దని..

- భార్య మృతి తట్టుకోలేక భర్త ఆత్మహత్య

వర్ని: ప్రేమతో వారిద్దరి మనసులు కలిశాయి. వివాహ బంధంతో ఒక్కటయ్యారు. జీవితాంతం ఒకరికొకరు కష్టసుఖాల్లో తోడునీడగా ఉండాలని భావించారు. కానీ విధి ఆడిన వింత నాటకంలో భార్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆమె మృతుని తట్టుకోలేని భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన వర్ని మండలం వడ్డేపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. రుద్రూర్ మండలం అంబం గ్రామానికి చెందిన ఎరుకల పోశెట్టి(25) వడ్డేపల్లిలో ఉండే తన బంధువుల ఇంట్లో చిన్న నాటి నుంచి ఉంటున్నాడు. అదే గ్రామానికి చెందిన అనితను ఆరు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరి జీవితం సాఫీగా సాగుతుందనుకుంటున్న సమయంలో ఇటీవల ఆమె అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె మృతిని తట్టుకోలేని పోశెట్టి తన ఇంటి సమీపంలోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.



పోశెట్టి (ఫైల్)

హత్యాయత్నం కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

కామారెడ్డి క్రైం: మహిళపై కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడికి కామారెడ్డి కోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధించింది. వివరాలిలా ఉన్నాయి. మరో వ్యక్తితో సన్నిహితంగా ఉంటుందనే అనుమానంతో మాచారెడ్డి మండలం నెమ్లి గుట్ట తండాకు చెందిన జెర్పుల నవీన్ 2017 ఫిబ్రవరిలో అతని వదిన జర్పుల సంకి పై కత్తితో దాడి చేసి పొడిచాడు. కేసు నమోదు చేసిన పోలీసులు అతడిని రిమాండ్‌కు పంపారు. నాటి నుంచి కేసు కోర్టు పరిశీలనలో ఉంది. సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి సీహెచ్‌వీఆర్ఆర్ వరప్రసాద్ నేరం రుజువు కావడంతో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించారు. సరైన పద్ధతిలో కేసు విచారణ చేపట్టిన పోలీసు అధికారులు, కోర్టు సిబ్బందిని ఎస్పీ రాజేశ్ చంద్ర అభినందించారు.

కుప్రియాల్‌లో మూడేళ్లుగా కుల బహిష్కరణ

- ఐదుగురిపై కేసు నమోదు

సదాశివనగర్: మండలంలోని కుప్రియాల్‌లో పెట్టిన కేసు నుంచి తప్పించాలని మూడేళ్లుగా పద్మశాలి కులానికి చెందిన ఓ కుటుంబాన్ని కులం నుంచి బహిష్కరణ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ బహిష్కరణకు కారకులైన ఐదుగురిపై సదాశివనగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. ఈ ఘటనకు కారకులైన పాముల రాములు, పాముల అశోక్, యేషాల ప్రదీప్, అంకం రాములు, బోగ వెంకటనారాయణలపై కేసు నమోదైనట్లు ఎస్సై రంజిత్ కుమార్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. కుప్రియాల్‌కు చెందిన అంకం బాల్‌రాజ్ 30 ఏళ్ల క్రితం ఉపాధి నిమిత్తం రాజన్న సిరిసిల్లా జిల్లా గంభీరావ్‌పేట్ మండలం నాగంపేట్‌కు వెళ్లి అక్కడే స్థిర పడ్డారు. ఈ క్రమంలో బాల్‌రాజ్ బంధువుల మహిళలను వేధిస్తు లేఖ రాయడంతో బాల్‌రాజ్ కుమారుడు ప్రశాంత్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. దీంతో కుప్రియాల్‌కు చెందిన నలుగురిపై కేసు నమోదు చేశారు. తమపై పెట్టిన కేసును వెనక్కి తీసుకోవాలని, కేసు నుంచి తమను తప్పించాలని కుప్రియాల్‌లో ఉంటున్న బాల్‌రాజ్ చిన్న నాన్న కిష్టయ్యపై సంఘంలోని కొందరు ఒత్తిడి తీసుకొచ్చారు. ఈ కేసు నేను పెట్టలేదని కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని కిష్టయ్య ఎంతా చెప్పిన పట్టించుకోకుండా గత మూడేళ్లుగా కులం నుంచి బహిష్కరించారు. సంఘంలో చందా కట్టుకోకపోగా, మంచి చెడులకు పిలవడం లేదని బాధితుడు పేర్కొన్నట్లు తెలిపారు. కులం నుంచి బహిష్కరించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేసు కోసం ఖర్చు అయిన రూ.50వేలు చెల్లిస్తేనే కులంలోకి తీసుకుంటామని చెబుతున్నారని బాధితుడు వాపోయాడు. బాధితుడు కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సీసీ కెమెరాలుంటే పోలీసులున్నట్టే

మాచారెడ్డి: గ్రామాల్లో సీసీ కెమెరాలుంటే పోలీసులున్నట్టేనని మాచారెడ్డి ఎస్సై అనిల్ అన్నారు. సోమవారం పాల్వంచ మండలం వాడిలో ముదిరాజ్ సంఘ సభ్యులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో దొంగతనాలు జరగకుండా ఉండాలంటే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

అంతర్‌జిల్లా దొంగల ముఠా రిమాండ్

- 12 తులాల బంగారం, బైక్ స్వాధీనం



వేములవాడ: వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్‌జిల్లా దొంగల ముఠాను రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ పోలీసులు సోమవారం తెలిపారు. వేములవాడ టౌన్ పీఎస్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మహేశ్ బీ గీతే వివరాలు వెల్లడించారు. జగిత్యాల జిల్లాకు చెందిన బోదాసు మహేశ్ నిజామాబాద్ జిల్లాకు చెందిన గద్దల స్వప్న, విశాల్‌సింగ్, జగిత్యాల జిల్లాకు చెందిన నేరెళ్ల శ్రీనివాస్, నేరెళ్ల రాణి, గోత్రాల బాలమణి ముఠాగా ఏర్పడి ఆర్మూర్, నిజామాబాద్, వేములవాడ, కోనరావుపేట, బోయినపల్లి ప్రాంతాల్లో గత రెండు నెలలుగా దొంగతనాలకు పాల్పడ్డారు. టెక్నాలజీ సాయంతో వీరు వేములవాడ సమీపంలో తిప్పాపూర్ బస్టాండ్ ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 12 తులాల బంగారం, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. దొంగలను పట్టుకున్న వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్, ఎస్సైలు అనిల్‌కుమార్, వెంకట్రాజం, సిబ్బంది గోపాల్, పంతులు, లత, సాహెబ్ హుస్సేన్, దేవేందర్, సమియుద్దీన్‌ను అభినందించారు.